నమస్తే తెలంగాణ
# కరీంనగర్
12 | కరీంనగర్, మంగళవారం 18 మార్చి 2025 | KARIMNAGAR

## ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు



కేసీఆర్‌ను అభాసుపాలు చేయాలనే దురుద్దేశంతోనే కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టి కాంగ్రెస్ పార్టీ కరువు తెచ్చింది. నీళ్ల కోసం ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితులు మళ్లీ వచ్చాయి. రేవంత్‌రెడ్డి సర్కార్‌కు వ్యతిరేకంగా ఉద్యమాల పురిటి గడ్డ రామగుండం నుంచే మరో ఉద్యమం ప్రారంభమైంది. ఎండిన గోదావరిని నింపుకొనేందుకే ఈ ఉద్యమం. ప్రతి గ్రామం నీళ్ల కోసం పరితపిస్తున్నది. పదేళ్ల పాటు సీఎం కేసీఆర్ ప్రగతి పథంలో నడిపితే రేవంత్‌రెడ్డి రైతులను గోస పెడుతున్నారు. దొంగ ప్రచారాలు, మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టులో చిన్న రిపేర్ చేయాల్సిన పరిస్థితి ఉన్నా గోదావరిని ఎండబెట్టి నీళ్లను సముద్రంలోకి వదిలారు. గోదావరిఖనిలోనే పదిరోజులకు ఒక సారి తాగు నీళ్లు వస్తున్నాయి. ఇంకా కష్టాలు పెరుగుతాయి. కాంగ్రెస్, సీఎంకు బుద్ధి చెప్పేందుకే మహా పాదయాత్ర చేపట్టాం.

**- కోరుకంటి చందర్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు (పెద్దపల్లి)**

## బీఆర్ఎస్ నింపితే.. కాంగ్రెస్ ఎండబెట్టింది



ఎడారిగా ఉన్న గోదావరిని బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును కట్టి నిండు కుండలా చేస్తే.. కాంగ్రెస్ సర్కారు ఎండబెట్టింది. కాంగ్రెస్ అంటేనే కన్నీళ్లు.. ప్రజా వంచన అని మరోసారి నిరూపించారు. అందుకు ఈ గోదావరే సజీవ సాక్ష్యం. సీఎం రేవంత్‌రెడ్డికి ఈ ప్రాంతంపై ప్రేమ ఉండకపోవచ్చు. కానీ, ఇదే గోదావరి తీరం వెంట ప్రస్తుతం ఉన్న మంథని, రామగుండం, పెద్దపల్లి, మంచిర్యాల, చెన్నూరు ఎమ్మెల్యేలు చవటలు, దద్దమ్మలుగా మిగిలిపోయారు అనేందుకు ఎండిన గోదావరే నిదర్శనం. శివరాత్రి రోజు పుణ్య స్నానం చేయడానికి కూడా నీళ్లు ఉంచని వీళ్లను గెలిపించినందుకు ప్రజలు బాధ పడుతున్నారు. గోదావరిని ఎండబెట్టడంతో మత్స్యకారులు, రైతులు తీవ్రంగా అన్యాయం అవుతున్నారు. ఎమ్మెల్యేలు ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలపై కేసులపై పెడుతున్న శ్రద్ధ గోదావరిలో నీళ్లపై పెడితే ఈ ప్రాంతానికి మేలవుతుంది. ఈ మహాపాదయాత్రతోనైనా వారికి బుద్ధి వస్తుంది.

**-పుట్ట మధూకర్, మాజీ ఎమ్మెల్యే (మంథని)**

# వెలుగులోకి 'సీఎంఆర్ఎఫ్ చెక్కుల స్వాహా'



- సంచలనం రేపిన 'నమస్తే తెలంగాణ' కథనం
- బయటపడిన అక్రమాల బాగోతం
- ఒకరి చెక్కును మరో ఖాతాలో వేసి డ్రా
- తాజాగా ఇద్దరు అరెస్ట్.. రిమాండ్
- కాజేసిన ₹60వేల రికవరీ
- లోతుగా విచారిస్తే భారీగా బయటపడే అవకాశం

**ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల స్వాహా స్కాం బట్టబయలైంది. ఈ మేరకు ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపగా, అందులో ఒకరు కాంగ్రెస్ నాయకుడు కావడం సంచలనం రేపుతున్నది. మానకొండూర్ అసెంబ్లీ నియోజకవర్గం ఇల్లంతకుంట మండలంలో జరిగిన సీఎంఆర్ఎఫ్ అక్రమాలపై 'సీఎంఆర్ఎఫ్ చెక్కుల స్వాహా' శీర్షికన ఈనెల 15న 'నమస్తే తెలంగాణ' మెయిన్ సంచికలో కథనం ప్రచురించింది. కొంతమంది కాంగ్రెస్ నాయకులు ఒక ముఠాగా ఏర్పడి.. సీఎంఆర్ఎఫ్ చెక్కుల డబ్బులను ఎలా స్వాహా చేస్తున్నారనే విషయాలను కండ్లకు కట్టినట్టు వివరించింది. ఒకరి చెక్కులను మరొకరి ఖాతాలో వేసుకుంటూ.. వాటిని సొమ్ము చేసుకుంటూ.. స్వాహా చేస్తున్న తీరును ఎండగట్టింది.**

కరీంనగర్, మార్చి 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలానికి చెందిన కే రవి గతంలో తన తండ్రికి ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స చేయించాడు. అందుకు అయిన ఖర్చులను ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నాడు. నెల క్రితం అతని పేరిట ₹60వేల చెక్కువచ్చింది. ఆ మేరకు ఈ విషయాన్ని తెలుసుకున్న కొంత మంది కాంగ్రెస్ నాయకులు ఆ చెక్కును తీసుకెళ్లి.. అదే మండలం రహీంఖాన్‌పేటకు చెందిన కే రవి అనే పేరున్న వ్యక్తి ఖాతాలో జమ చేశారు. ఆ తర్వాత డ్రాచేసిన ₹60వేలను పంచుకున్నారు. ఈ తతంగాన్ని ఈనెల 15న 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి వచ్చింది. నిజానికి ఈ కథనం రాష్ట్రంలోనే సంచలనం సృష్టించింది. అయితే దీనిని కప్పిపుచ్చేందుకు కొన్ని శక్తులు శతవిధాలుగా ప్రయత్నాలు చేసినట్టు సమాచారం. కానీ, ఈ విషయాన్ని 'నమస్తే తెలంగాణ' బహిర్గతం చేయడంతో తప్పని పరిస్థితుల్లో పోలీసులు అరెస్టు చేయక తప్పలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ఇద్దరు రిమాండ్

రెండు నెలల క్రితం ఇల్లంతకుంట మండలానికి చెందిన 40 సీఎంఆర్ఎఫ్ చెక్కులు లబ్ధిదారులకు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. మానకొండూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఇల్లంతకుంటకు చెందిన వినయ్ ద్వారా ఈ చెక్కులను పంపగా, రహీంఖాన్‌పేట్‌కు చెందిన అంతగిరి శ్రీనివాస్ అనే వ్యక్తి కే రవి అనే లబ్ధిదారుడి పేరు మీదున్న చెక్కుతోపాటు సంబంధం లేని మరో ₹60వేల విలువ చెక్కును తీసుకెళ్లాడు. వినయ్ నుంచి ఆ చెక్కును తీసుకెళ్లిన శ్రీనివాస్, రహీంఖాన్‌పేటకే చెందిన మరో వ్యక్తి కే రవికి కొన్ని డబ్బులు ఇస్తామని ఆశ చూపాడు. ఆయన అకౌంట్‌లో చెక్కు వేసి డబ్బులు డ్రాచేశాడు. వచ్చిన మొత్తం నుంచి కే రవి ₹20వేలు తీసుకోగా.. మిగిలిన ₹40వేలను శ్రీనివాస్ తీసుకున్నాడు. ఈ వివరాలను ఇల్లంతకుంట మండల పోలీసులు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. మానకొండూర్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ పీఏ డోలి సాయికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సోమవారం అంతగిరి శ్రీనివాసుతో పాటు కే రవిని అదుపులోకి తీసుకొని విచారణ చేశారు. ఆ ఇద్దరు నేరం ఒప్పుకున్నారని, ఆ మేరకు రవి నుంచి ₹20వేలు, శ్రీనివాస్ నుంచి ₹40వేలు స్వాధీనం చేసుకొని రిమాండ్ చేశామని ఇల్లంతకుంట ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. అందులో అంతగిరి శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకుడు కావడం గమనార్హం.

### తీగలాగితే కదలనున్న డొంక

నిజానికి ఇది ఒక్కరి ఇద్దరి సమస్య మాత్రమే కాదు, లోతుగా వెళ్తే ఈ స్కాం భారీగానే జరిగినట్టు తెలుస్తున్నది. దాదాపు ₹20లక్షల నుంచి ₹30లక్షల వరకు ఈ తరహాలోనే సీఎంఆర్ఎఫ్ చెక్కుల సొమ్మును స్వాహా చేసినట్టు విశ్వసనీయ సమాచారం. అందుకోసం కొంత మంది కాంగ్రెస్ నాయకులు ఒక ముఠాగా ఏర్పడి ఈస్కాంకు పాల్పడుతున్నట్టు విమర్శలు వస్తున్నాయి. ఈ తరహా వ్యవహారం కేవలం ఇల్లంతకుంట మండలంలోనే కాదు, చాలా చోట్ల జరిగినట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో ఈ స్కాంపై లోతుగా విచారణ జరపాలన్న డిమాండ్ వస్తున్నది. ప్రధానంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు నియోజకవర్గం మొత్తం మీద ఇచ్చిన సీఎంఆర్ఎఫ్ చెక్కులెన్ని? సదరు బాధిత వ్యక్తులకు అవి అందాయా.. లేదా? అనే వివరాలను క్షేత్ర స్థాయిలో తెలుసుకునేందుకు దరఖాస్తు దారుడికి ఇంటికి వెళ్లి విచారణ చేస్తే.. మొత్తం బండారం బయటపడే అవకాశముంటుంది. నిజానికి ఈ తరహా అక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయనే విమర్శలు వస్తుండగా.. తమకు మాత్రం ఒకే ఫిర్యాదు అందిందని, ఆమేరకు విచారణ చేసి ఇద్దరిని రిమాండ్‌కు పంపించామని ఇల్లంతకుంట ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ 'నమస్తే'కు తెలిపారు. అయితే దీనిపై లోతైన విచారణ జరిపి తీరాల్సిందేనని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తాజాగా డిమాండ్ చేశారు.



'ఖని' గోదావరితీరంలో గోదావరి మాతకు కొబ్బరికాయ కొట్టి పాదయాత్రను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, పుట్ట మధూకర్, నాయకులు

# నీళ్లు సాధించేదాకా పోరాటం

- కాంగ్రెస్ సర్కారు కుట్రతో ఎడారిగా గోదావరి
- మహా పాదయాత్రతో రామగుండంలో అగ్గి
- 'గోదావరి తల్లి కన్నీటి గోస' యావత్ తెలంగాణను కదిలిస్తుంది
- రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- గోదావరిఖని గోదారి తీరం నుంచి మహాపాదయాత్ర ప్రారంభం
- మొదటి రోజు 30 కిలోమీటర్ల నడక



పాదయాత్రలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే కోరుకంటి చందర్, నాయకులు

పెద్దపల్లి, మార్చి 17 (నమస్తే తెలంగాణ): యావత్ రాష్ట్రానికే నీటి కుండగా పేరుగాంచిన గోదావరి తీరం నేడు కాంగ్రెస్ సర్కారు కుట్రపూరిత రాజకీయాలతో ఎడారిగా మారిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆందోళన వ్యక్తం చేశారు. సాగు, తాగునీళ్లను సాధించుకునే వరకూ పోరాడుతామని స్పష్టం చేశారు. 'గోదావరి తల్లి కన్నీటి గోస' మహాపాదయాత్రతో యావత్ తెలంగాణను కదిలిస్తుందని, కాంగ్రెస్ పార్టీకి కనువిప్పు కలిగిస్తుందని చెప్పారు. బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, తెలంగాణ ఉద్యమకారుడు బొడ్డు రవీందర్ ఆధ్వర్యంలో గోదావరి తల్లి కన్నీటి గోసను కండ్లగడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు విశిష్టతను వివరిస్తూ, కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ 180 కిలో మీటర్ల మహా పాదయాత్ర చేపట్టారు. ఈ నెల 22 వరకు సాగనున్న ఈ యాత్రను సోమవారం ఉదయం గోదావరిఖని గోదావరి తీరంలో కోరుకంటి చందర్, బొడ్డు రవీందర్, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధుకర్, నడిపల్లి దివాకర్‌రావుతో కలిసి కొప్పుల ప్రారంభించారు. మొదటి రోజు 30 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. రాత్రి 9గంటల వరకు పెద్దపల్లికి చేరుకున్నారు. యాత్ర పొడవునా ప్రజలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ప్రారంభ కార్యక్రమంలో కొప్పుల మాట్లాడుతూ.. వృథాగా సముద్రంలో కలుస్తున్న గోదావరి జలాలను ఒడిసి పట్టి తెలంగాణ బీళ్లకు మళ్లించిన అపర భగీరథుడు కేసీఆర్ అయితే, కడుపు మంటతో కాళేశ్వరంపై నిందలు వేసి రైతుల కన్నీటికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు కారణమైందని దుయ్యబట్టారు. కాళేశ్వరం అంటే కాంగ్రెస్ చెప్పే కట్టు కథ కాదని, మూడు బరాజ్‌లు, 15 రిజర్వాయర్లు, 19 సబ్ స్టేషన్లు, 21 పంప్‌హౌస్‌లు, 200 కిలో మీటర్ల సొరంగాలు, 1530 కిలో మీటర్ల గ్రావిటీ కెనాళ్లు, 98కిలో మీటర్ల ప్రెజర్‌మెయిన్స్, 141 టీఎంసీలను 530 మీటర్ల ఎత్తుకు ఎత్తిపోయడం, 240 టీఎంసీల ఉపయోగంతో ప్రాజెక్టును గొప్పగా నిర్మించినట్లు వివరించారు. ఒక్క మేడిగడ్డలో పిల్లర్ కుంగినంత మాత్రాన ప్రాజెక్టు పోదని, ప్రతి రైతన్న పంట పొలంలో కాళేశ్వరం ఉంటుందన్నారు. కేసీఆర్ గుర్తులను చెరిపేస్తానంటున్న రేవంత్‌రెడ్డి కాళేశ్వరంతో పండిన పంటల గుర్తులు, రైతులు గుండెల్లో ఉన్న స్థానాన్ని చెరిపేయలేరని చెప్పారు. కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను యావత్ తెలంగాణ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని, తగిన సమయంలో ఆయనకు, కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతారన్నారు. మహాపాదయాత్రతో రామగుండంలో అగ్గి రాజుకున్నదని, ఈ ఉద్య మం రాష్ట్రవ్యాప్తంగా సాగుతుందన్నారు. ఇది చిన్న పోరాటమే కావచ్చు కానీ, దాని వెనుక న్యాయం ఉంటే రాష్ట్రమంతటా అంటుకుంటుందని, అదే మహోద్యమం అవుతుందన్నారు. కేసీఆర్ అండదండలతో నీళ్లు సాధించే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసిన కోరుకంటి చందర్, బొడ్డు రవీందర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మూల విజయరెడ్డి, కౌశిక్ హరి, రఘువీర్‌సింగ్, నడిపెల్లి అభిషేక్‌రావు, ఉప్పు రాజ్ కుమార్, నారాయణదాస్ మారుతి, బొడ్డుపల్లి శ్రీనివాస్, జేవీ రాజుతో పాటు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కరువు కనబడటం లేదా?



కాళేశ్వరంపై కక్షగట్టి ఉన్న నీళ్లను కిందికి వదిలి లేని కరువును కాంగ్రెస్ తీసుకువచ్చింది. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. ఎండిన పొలాల్లో రైతులు పశువులను మేపుతున్నారు. కాంగ్రెస్‌కు రైతులపై ఎందుకీ కక్ష.. కేసీఆర్‌పై కోపంతో కాళేశ్వరం ప్రాజెక్టును అభాసుపాలు చేసేందుకు కుట్ర చేశారు. రైతులను నిలువునా ముంచుతున్నారు. 500 మందికిపైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ప్రస్తుతం ఉన్న కరువు ప్రభుత్వానికి కనబడడం లేదా?. ఇప్పటికైనా కళ్లు తెరవాలి. కాళేశ్వరాన్ని రిపేర్ చేసి నీళ్లను నింపాలి.

**-నడిపెల్లి దివాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే (మంచిర్యాల)**

### రైతుల కన్నీళ్లు తుడిచేందుకే..



గోదావరి తీరాన్ని ఉద్యమ నేత కేసీఆర్ కాళేశ్వరంతో నిండుకుండను చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మళ్లీ ఎండిపోయింది. కేసీఆర్‌ను, కాళేశ్వరం ప్రాజెక్టును అభాసుపాలు చేయడానికే ఇలా చేశారు. ఈ కుట్ర వల్ల రైతులు నష్టపోతున్నారు. మా ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. కాళేశ్వరం లేక చెరువులు ఎండుతున్నాయి. కాలువల్లో నీళ్లు పారడం లేదు. రైతుల కండ్లలో కన్నీళ్లు పారుతున్నాయి. రైతుల ఆ కష్టాలను దూరం చేసేందుకే.. కన్నీళ్లను తుడిచేందుకే గోదావరిఖని నుంచి 180కిలో మీటర్ల మహాపాదయాత్రకు శ్రీకారం చుట్టాం.

**-బొడ్డు రవీందర్, మహాపాదయాత్ర కో-కన్వీనర్ (గోదావరిఖని)**

## కాలువ నీటి కోసం రైతుల ఆందోళన



వెదురుగట్టు శివారులోని ఎస్సారెస్పీ ప్రధాన డీ 86 వద్ద షటర్ ఎత్తుతున్న రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

కరీంనగర్ రూరల్, మార్చి 17 : ఎస్సారెస్పీ కాలువ నీటి కోసం పలువురు రైతులు ఆందోళన చేపట్టగా పోలీసులు అడ్డుకున్నారు. సోమవారం కరీంనగర్ మండలంలోని చామనపల్లి, తాహెర్ కొండాపూర్, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని ఐతరాజ్‌పల్లి గ్రామాల రైతులు కాలువ నీటి కోసం వెదురుగట్టు శివారులోని ఎస్సారెస్పీ ప్రధాన కాలువ డీ 86 వద్దకు వెళ్లారు. తమ గ్రామాలకు వచ్చే 11 ఆర్ ఉప కాలువ తూము షటర్ పైకి లేపేందుకు రైతులు ప్రయత్నించగా జూలపల్లి పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. కాలువ నీళ్లు రాకపోవడంతో పంటలన్నీ ఎండిపోతున్నాయంటూ పలువురు రైతులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చివరకు రైతులు బలవంతంగా కొంత మేర షటర్ ఎత్తడంతో ఉపకాలువలోకి నీళ్లు రాగా, వివాదం సద్దుమణిగింది.

## గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

తిమ్మాపూర్,మార్చి17 : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మహాత్మ జ్యోతిబా పూలే బాల, బాలికల గురుకుల పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతుల్లో మిగిలిన సీట్లకు వచ్చే విద్యాసంవత్సరానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంజేపీ గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ అంజలి ఒక ప్రకటనలో తెలిపారు. www.mjptbcwreis.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని, అర్హత గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# పార్టీ మార్పు.. కక్షసాధింపు!

## కాంగ్రెస్‌ను వీడి గులాబీ పార్టీలోకి చేరినందుకు కక్షపూరిత చర్యలు

- బీఆర్ఎస్‌లో చేరిన 24 గంటల్లోనే మాజీ సర్పంచ్ స్టేషన్‌కు తరలింపు
- అనారోగ్యంగా ఉన్నా వినిపించుకోకుండా తీసుకెళ్లిన పోలీసులు
- హస్తం నాయకులకు వత్తాసు పలుకుతున్నారనే విమర్శలు
- ఆగ్రహించిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిక



బోయినపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి వాకర్ సహాయంతో బయటకు వస్తున్న మాజీ సర్పంచి నందయ్య

**కాంగ్రెస్‌పై ప్రజల్లో అసంతృప్తి రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని కొంత మంది నాయకులు వలసలను ఆపేందుకు శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో పోలీసులు అస్త్రం ప్రయోగిస్తున్నారు. నిరాధారమైన ఫిర్యాదులతో భయకంపితులను చేసేందుకు కుట్రలు పన్నుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లెలో సోమవారం జరిగిన ఘటనే దీనికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తుండగా, ఈ వ్యవహారంలో పోలీసుల తీరు విమర్శలకు తావిస్తున్నది.**

కరీంనగర్, మార్చి 17(నమస్తే తెలంగాణ ప్రతినిధి)/వేములవాడ : రాజకీయ పార్టీలో మార్పులు, చేర్పులు, చేరికలు వంటివి సహజంగా జరుగుతాయి. అందులో భాగంగానే ఈనెల 16న బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లె గ్రామంలో మాజీ సర్పంచ్ బూరుగుల నందయ్య, యూత్ అధ్యక్షుడు కట్ట గోవర్ధన్ ఆధ్వర్యంలో.. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సమక్షంలో పలువురు యువకులు.. కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఇదంతా బహిరంగంగానే జరిగింది. ఇదే విషయాన్ని సదరు నాయకులు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ఇది కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో వైరల్‌గా మారింది. పల్లె నుంచే చేరికల ప్రస్థా నం మొదలైందని, మున్ముందు మరిన్ని వలసలు పెరుగుతాయన్న అభిప్రాయాలు సోషల్ మీడియాలో వ్యక్తమయ్యాయి.

### మింగుడు పడని కాంగ్రెస్

చేరికల విషయం సోషల్‌మీడియాలో ప్రచారం కావడంతో తట్టుకోలేని కొంత మంది నాయకులు.. బీఆర్ఎస్‌లో చేరిన పలువురిని తిరిగి కాంగ్రెస్‌లో కలుపుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేశారు. అందుకోసం ఒక అడుగు ముందుకేసి ఆశ పెట్టినట్టు కూడా తెలుస్తున్నది. అయినా ఏ ఒక్కరూ కూడా తిరిగి హస్తం పార్టీకి వెళ్లేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో పరిస్థితి చేజారుతుందని భావించిన కొంత మంది కాంగ్రెస్ నాయకులు.. ఈ వలసలకు అడ్డుకట్ట వేయాలని భావించి పోలీసుల అస్త్రాన్ని ప్రయోగించారన్న విమర్శలు వస్తున్నాయి. వెంకట్రావుపల్లెలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరిన వారి సంఖ్య ఎక్కువగా చూపుతూ.. అబద్ధపు ప్రచారం చేస్తున్నారంటూ కొంత మంది హస్తం నాయకులు సోమవారం బోయినపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

### బలవంతంగా స్టేషన్‌కు

నిజానికి ఫిర్యాదు తీవ్రతతో కూడుకున్న సమస్య కాదు కానీ, పోలీసులు అత్యంత సీరియస్‌గా తీసుకున్నట్టు కనిపిస్తున్నది. ఫిర్యాదు రావడమే ఆలస్యం అన్నట్టు అత్యుత్సాహం చూపారన్న విమర్శలు వస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో మాజీ సర్పంచ్ నందయ్య ఇంటికి ముందుగా కానిస్టేబుల్‌ను పంపించారు. స్టేషన్‌కు రావాలని చెప్పగా.. 25 రోజుల క్రితమే తన తొంటికి శస్త్ర చికిత్స జరిగిందని, తాను నడువలేని స్థితిలో ఉన్నానని నందయ్య సదరు కానిస్టేబుల్‌కు వివరించగా, ప్రత్యక్షంగా పరిస్థితిని చూసిన ఆ కానిస్టేబుల్ ఈ సమాచారాన్ని ఎస్ఐకి వివరించారు. అయినా వినకుండా ఏకంగా పోలీస్ వాహనాన్ని పంపించి.. జబర్దస్తీగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. 'మా ఆయన ఏం తప్పుచేశారో చెప్పి తీసుకెళ్లండి' అంటూ నందయ్య సతీమణి ప్రశ్నిస్తే.. 'మాకేమి తెలియదు. ఫిర్యాదు వచ్చింది తీసుకెళ్తున్నాం' అని పోలీసులు చెప్పారు. ఈ సమయంలో నందయ్య కొడుకు ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా అడ్డుపడ్డారు. చివరికి కుటుంబ సభ్యులను బెదిరించి.. నందయ్యను బలవంతంగా స్టేషన్‌కు తీసుకెళ్లారు. స్టేషన్‌లోనూ పోలీసులకు-నందయ్యకు కొద్దిసేపు వాగ్వాదం జరిగినట్టు తెలుస్తున్నది. ముందుగా తనను పోలీస్‌స్టేషన్‌కు ఎందుకు తీసుకొచ్చారో చెప్పాలని ప్రశ్నించాడు. తప్పుడు ప్రచారం చేస్తున్నట్టు ఫిర్యాదు వచ్చిందని, ఆధార్‌కార్డు ఇస్తే కేసు నమోదు చేస్తామంటూ పోలీసులు చెప్పారని, దీనిని వ్యతిరేకించినట్టు నందయ్య 'నమస్తే'కు తెలిపాడు. అవసరమైతే రేపు సాయంత్రం వరకు ఇక్కడే కూర్చుంటాను తప్ప ఆధార్ కార్డు ఇచ్చే ప్రసక్తేలేదని స్పష్టం చేసినట్టు చెప్పాడు. ఇదే సమయంలో హస్తం గూటిని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరిన మరికొంత మందికి కూడా పోలీసులు ఫోన్లు చేసి స్టేషన్‌కు రమ్మని బెదిరించినట్టు విమర్శలు వస్తున్నాయి.



### పునరావృతమైతే ఆందోళన చేస్తాం: చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని, అక్కడి అధికారులతో మాట్లాడారు. పార్టీలు మారినంత మాత్రాన భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే తాము ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. అవసరమైతే మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. పోలీసులు అందరనీ సమానంగా చూడాల్సింది పోయి కాంగ్రెస్‌కు తొత్తుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్నా కనీస మానవీయత లేకుండా పోలీసులు వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. ఇటువంటి చర్యలు మానుకోవాలని సూచించారు. మరోసారి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అక్రమ అరెస్టులు చేస్తే సహించేంది లేదన్నారు. అనంతరం ఆయన తన వాహనంలో నందయ్యను ఇంటి వద్ద దింపారు. సుంకె వెంట బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్, రవి, కమల్ గౌడ్, సాగర్, అనిల్ మధు తదితరులు ఉన్నారు. అయితే ఈ విషయమై ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్‌ను 'నమస్తే' వివరణ కోరగా, సామాజిక మాధ్యమాలలో తప్పుడు పోస్టులు పెడుతున్నట్టు ఫిర్యాదు వచ్చినందునే పిలిచి విచారించామని తెలిపారు.